క్లుప్తంగా

నేడు వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రి టి. హరీష్‌రావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్, శంభీపూర్ రాజు గురువారం హాజరవుతారని కూకట్‌పల్లి బీఆర్ఎస్ కోఆర్డినేటర్ సతీష్ అరోరా తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

జంతువుల వ్యర్థాలను కవర్లలోనే వేయాలి


మసీదు నిర్వాహకులకు కవర్లను అందజేస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: బక్రీద్ సందర్భంగా కుర్బానీ ఇచ్చిన జంతు వ్యర్థాలను జీహెచ్ఎంసి అందజేస్తున్న కవర్లలోనే వేసి ఇవ్వాలని కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. వీటిని అన్ని బస్తీల్లోని మసీదు నిర్వాహకులకు అధికారులు అందజేస్తారని తెలిపారు. జంతువుల వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేసి స్వచ్ఛ భారత్‌కు తూట్లు పొడవొద్దన్నారు. స్వచ్ఛ ఆటో రిక్షా కార్మికులకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏలు సురేష్, నరసింహ, సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాహెద్ షరీఫ్ బాబా, అబ్దుల్ హమీద్, షేక్ రఫీక్, అబ్దుల్ సలీం, లక్ష్మి, రేవతి, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

తగ్గింపు ధరలకు బ్రాండెడ్ దుస్తులు


దుస్తులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

సాక్షి సిటీబ్యూరో: నిజాంపేట్ కొలన్ నారాయణరెడ్డి గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో లగ్జరీ బ్రాండెడ్ దుస్తులను భారీ తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు, మహిళలు, పిల్లల పలు రకాల దుస్తులు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు విక్రయాలు కొనసాగుతాయని తెలిపారు. మరో 4రోజులు మాత్రమే అమ్మకాలు ఉంటాయని తెలిపారు.

ఇంటింటికీ బీజేపీ


పీఆర్‌నగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మహేందర్

మోతీనగర్: బీజేపీ పార్టీ రాష్ట్ర పిలుపు మేరకు చేపట్టిన ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో బుధవారం మూసాపేట కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పీఆర్‌నగర్‌లో ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ కుటుంబ పాలనకు ప్రజలు సరైన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో శోభారాజన్, రమేష్ నాయుడు, సునీల్, శేఖర్, రాము తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ కాంపిటీషన్‌పై అవగాహన

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ప్రగతి కళాశాలలో బుధవారం రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌పై ఎన్ఎస్‌యూఐ నాయకులు అవగాహన కల్పించారు. జూలై 2న జరిగే క్విజ్‌లో విద్యార్థులు పాల్గొని బహుమతులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు, ఎన్ఎస్‌యూఐ స్టేట్ జనరల్ సెక్రటరీ సయాద్ మిస్బా, డివిజన్ అధ్యక్షుడు మేకల రమేష్, దేవేందర్‌యాదవ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


ఆయూబ్‌ఖాన్ (ఫైల్)

మోతీనగర్: ఓ యువకుడు తండ్రి సంవత్సరికానికి వచ్చి అదృశ్యమైన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ తిరుపతి అంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 25న హఫీజ్‌పేట్‌కు చెందిన ఆయూబ్‌ఖాన్ (22) అల్లాపూర్ డివిజన్‌లోని కొత్తూరు సీతయ్యనగర్‌లోని తన నానమ్మ ఇంటి వద్ద తండ్రి సంవత్సరికం ఉన్నందున తల్లి ముంతాజ్‌బేగంతో కలిసి వచ్చి అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన ఆ యువకుడి తల్లి ముంతాజ్ బేగం బంధువుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకుండాపోయింది. అల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కంటి వెలుగు సేవలు భేష్

బాలానగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 10 కంటి వెలుగు కేంద్రాలు నిరంతరంగా పనిచేస్తున్నాయి. కంటి వెలుగు శిబిరాల్లో నేత్ర పరీక్షలు చేసుకోవడానికి ప్రజలు బాగా ఆసక్తి చూపుతున్నారు. కేపీహెచ్‌బీ కాలనీలోని రమ్యా గ్రౌండ్స్‌వద్ద వార్డు కార్యాలయం సమీపంలో, 4వ ఫేజులో మినీ ఫంక్షన్‌హాలు, భరత్‌నగర్, ఫిరోజ్‌గూడ, హెచ్ఎంటీ కాలనీ, బృందావన్ కాలనీ, హెచ్ఎంటీహాల్‌లో కంటి వెలుగు శిబిరాలు పనిచేస్తున్నాయి. వందరోజులు విజయవంతంగా పూర్తి అయింది.



- కంటి వెలుగు శిబిరాల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా వైద్య ఆరోగ్యశాఖ, జీహెచ్ఎంసీ శాఖలు కలిసి పనిచేస్తున్నాయి.
- వైద్య సిబ్బంది వైద్య సేవలు పొందానికి వచ్చి వారితో మంచిగా మాట్లాడుతూ.. ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తున్నారు. దీంతో శిబిరాల్లో సాఫీగా పరీక్షలు జరుగుతున్నాయి.
- శిబిరాల్లో రోజుకు సగటున 100 నుంచి 150 మందికి కంటి పరీక్షలు చేస్తున్నారు.
- నియోజకవర్గం పరిధిలో ఇప్పటి వరకు 15,507 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. దగ్గర చూపు లేని వారికి వెంటనే కంటి అద్దాలు అందిస్తున్నారు. దూరపు చూపు ఉన్న వారికి, దూరం దగ్గర రెండు చూపులు సరిగ్గా లేని వారికి కంటి అద్దాలు తెప్పించి అందజేస్తున్నారు.
- అవసరమైన వారికి శస్త్ర చికిత్సల కోసం సరోజని దేవి కంటి ఆసుపత్రికి పంపిస్తున్నారు.
- ప్రత్యేక కంటి అద్దాలు 4092 మందికి అందజేశారు. 6983 మందికి శస్త్ర చికిత్సల కోసం హాస్పటల్‌కు రిఫర్ చేశారు. జనవరి నెల 19వ తేదిన ప్రారంభమైన కంటి వెలుగు శిబిరాలు జూన్ 19వ తేది వరకు వంద రోజులు పూర్తి అయ్యాయి. 1,37,253 మంది వైద్య సేవలకు కంటి వెలుగు శిబిరాలను సందర్శించారు.

ప్రజలు ఆదరిస్తున్నారు..



కంటి వెలుగు కేంద్రాల్లో డాక్టర్లు బాగా చూస్తున్నారు. నేను అక్కడే కంటి పరీఓలు చేయించుకున్నాను. బయట కంటి ఆస్పత్రిలో పరీక్షలు చేయిస్తే ఎక్కువ ఖర్చు అయ్యింది. కానీ ఇక్కడ ఉచితంగానే నాణ్యమైన సేవలు అందిస్తున్నారు. ప్రజలు ఆదరిస్తున్నారు.

– డాక్టర్ చందర్, బాలానగర్ పీహెచ్‌సీ

వైద్య సేవలు అందిస్తున్నాం



కంటి వెలుగు శిబిరాలను ప్రజలు ఆదరిస్తున్నారు. నిర్ణీత సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నాం. మా సిబ్బంది సమష్టి కృషితో వంద రోజుల్లో కంటి వెలుగు శిబిరాలు విజయవంతం అయ్యాయి.

– బి. వెంకటరత్నం

విద్యారంగంలో తెలంగాణకు మెరుగైన స్థానం

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర విద్యా రంగంలో ఈ పదేళ్ల కాలంలో అనూహ్య మార్పులు జరిగాయిని, ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. జాతీయ సగటుతో పోల్చితే విద్యారంగంలో తెలంగాణ మెరుగైన స్థానాన్ని సాధించిందని స్పష్టం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ గోల్డెన్ సెలబ్రేషన్స్‌లో భాగంగా ఓయూలో ఈనెల 26 నుంచి 28 వరకు భారతదేశంలో సామాజిక సమూహాల అభివృద్ధి సాధికారత–తెలంగాణ రాష్ట్రం నుంచి పాఠాలు × అనే అంశంపై జరుగుతున్న జాతీయ సెమినార్ బుధవారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ లక్ష్మీనారాయణ, ఐసీఎస్ఎస్ఆర్–ఎస్ఆర్‌సీ గౌరవ సంచాలకులు ప్రొ. బి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ సెమినార్‌లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్నాటక, మధ్యప్రదేశ్, కేరళ, హర్యానా, న్యూఢిల్లీ తదితర రాష్ట్రాలనుంచి 25 మంది పరిశోధకులు పేపర్ ప్రజెంటేషన్ చేశారు.

నేడు తొలి ఏకాదశి పూజలు

మూసాపేట: తొలి ఏకాదశి సందర్భంగా గురువారం శ్రీ విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి వారికి 5.30 గంటల నుంచి అభిషేకాలు, సాయంత్రం రజత కవచ అలంకరణ దినోత్సవం నిర్వహిస్తున్నామని అర్చకులు కృష్ణసూరి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని హైటెన్షన్ రోడ్డు పనులను మధ్యలోనే ఆపివేశారని... ఆ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని బుధవారం కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ జీహెచ్‌యంసి కమిషనర్ లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు.

బ్రోచర్ ఆవిష్కరణ

లాలాపేట: ఓయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో జూలై 21,22 తేదీల్లో నిర్వహించతలపెట్టిన నేషనల్ సెమినార్ బ్రోచర్‌ను బుధవారం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ లింబాద్రి ఆవిష్కరించారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ డిజిటల్ ఎరా–ఇష్యూస్, చాలెంజెస్ అండ్ ప్రాస్పెక్టస్ అనే అంశంపై 2 రోజుల పాటు నేషనల్ సెమినార్ ఓయూ దూర విద్యా కేంద్రం ఆడిటోరియంలో జరుగనుంది.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ పనుల పరిశీలన



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి కూకట్‌పల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనల మేరకు అత్యాధునిక హంగులతో ఎమ్మెల్యే కాంపు కార్యాలయాన్ని నిర్మిస్తున్నామన్నారు. త్వరలో దీనిని ప్రారంభిస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి


అభివృద్ధి పనులపై సమావేశమైన మేయర్ నీలారెడ్డి, కార్పొరేటర్లు

నిజాంపేట్: వర్షాకాలం దృష్ట్యా అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ స్వతంత్ర కార్పొరేటర్లతో వివిధ సమస్యలపై మేయర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పనులపై దృష్టి సారించి పూర్తి చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో డ్రైనేజీ లైన్‌లు, నాలా నిర్మాణ పనులతో పాటు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా రోడ్ల పనులను చేపట్టాలని సూచించారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. పురాతన భవనాలను గుర్తించి వాటిని తొలగించాలని ఆదేశించారు. కార్పొరేటర్లు చిట్ల దివాకర్, బాలాజీ నాయక్, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అభిషేక్‌రెడ్డి, స్వతంత్ర కార్పొరేటర్లు వెంకట రామయ్య, శ్రీరాములు, "సుజాత, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అవినీతి పాలనతో ప్రజలు విసుగు చెందారు

బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలంగాణ ప్రజల దరి చేరకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుంటోందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ గోస – శ్రీశైలం అన్న భరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం సూరారం పరిధిలోని సంజయ్‌గాంధీనగర్ ఆయన పాదయాత్ర చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు ఇప్పించాలన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను స్థానికులు శ్రీశైలంగౌడ్ దృష్టికి తీసుకువచ్చారు.

- ఈ సందర్భంగా కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అవినీతిమయ పాలనతో ప్రజలు విసుగు చెందారన్నారు. వచ్చే ఎన్నికల్లో కారు టైర్లు పంక్చర్ కావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో బీజేపీ పవనాలు వీస్తున్నాయని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తామన్నారు.
- సూరారం డివిజన్ అధ్యక్షుడు దుర్యోధన్‌రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చండి శ్రీనివాస్, పత్తి రఘుపతి, సురేష్ గౌడ్, డివిజన్ ఇన్‌చార్జ్ రాజిరెడ్డి, సుశాంత్‌గౌడ్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజేష్ మిశ్రా, మహిళా మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యురాలు సంగీతా పాత్ర, నాయకులు సంతోష్ గుప్తా, సందీప్ గౌడ్, దీపక్ అంబేకర్, వేణు, నవీన్, నాగరాజు, సైదులు, వెంకటేష్ గౌడ్, పృథ్వీ, శంకర్ నాయక్, సరళా దేవి, శంకర్ గౌడ్, రఘు గౌడ్ తదితరులు ఉన్నారు.


సంజయ్‌గాంధీనగర్‌లో నెలకొన్న సమస్యలను వింటున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్


అవ్వను ఆప్యాయంగా పలకరిస్తున్న శ్రీశైలంగౌడ్

ట్రాఫిక్ పోలీసులకు సీపీఆర్‌పై అవగాహన


సీపీఆర్‌పై బేగంపేట ట్రాఫిక్ పోలీసులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం..

సనత్‌నగర్: విధి నిర్వహణతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడడంలో ట్రాఫిక్ పోలీసులు తమదైన పాత్ర పోషిస్తున్నారని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. బేగంపేటలోని టీటీఐలో ట్రాఫిక్ పోలీసులకు బుధవారం స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా వీ9 హాస్పటల్ వైద్యులు హాజరై పోలీసు సిబ్బందికి సీపీఆర్, ఏఈడీ, మాస్క్‌తో కూడిన అంబు బ్యాగ్, ప్రథమ చికిత్స తదితర అత్యవసర వైద్యసేవలపై అవగాహన కల్పించారు. ఎవరైనా గుండెపోటుకు గురైనప్పుడు సీపీఆర్ ద్వారా వారికి ఊపిరితిత్తుల పునరుజ్జీవం జరిగేలా ఏవిధంగా ట్రీట్‌మెంట్ అందించాలో డెమో ద్వారా వివరించారు. ఈ సందర్భంగా టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, గుండెపోటుతో అకస్మాత్తుగా కుప్పకూలిపోవడం వంటి సంఘటనలు ఎదురైనప్పుడు పోలీసులు వారికి సకాలంలో ప్రాథమిక చికిత్స అందించడంలో ముందుండాలన్నారు. పోలీసు అంటే సామాజిక బాధ్యత అనే విషయాన్ని ఎల్లవేళలా గుర్తెరగాలన్నారు. విధి నిర్వహణే కాకుండా అవసరమైనప్పుడు వైద్యుడిగా మారి తమకు తెలిసిన అత్యవసర వైద్య సేవలను అందించాలన్నారు. ఈ క్రమంలో ఎమర్జెన్సీ సర్వీసులు అందించడంపై పోలీసు సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, వీ9 హాస్పటల్ టీమ్ డాక్టర్ నగ్మా, కృష్ణ ప్రసాద్, ఉత్తేజ్, శ్రీమాధవ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో యూకే అధ్యాపకుల పర్యటన


ఓయూ వీసీతో యూకే అధ్యాపకుల బృందం

లాలాపేట: యూకేలోని అబెరిస్ట్విత్ యూనవర్సిటీకి చెందిన పలువురు అధ్యాపకులు బుధవారం ఓయూ క్యాంపస్‌లో పర్యటించారు. వారితో ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొ రవీందర్, రిజిస్ట్రార్ పి. లక్ష్మీనారాయణ సమావేశం అయ్యారు. ఇప్పటికే అబెరిస్ట్విత్ యూనివర్సిటీతో ఓయూకు పరస్పర అవగాహన ఒప్పందం ఉన్నందున కలిసి పనిచేద్దామని వీసీ రవీందర్ అన్నారు. రెండు యూనివర్సిటీలు కలిసి పరిశోధనలు నిర్వహించడంతో పాటు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూకే అధ్యాపకులు డా డేవిడ్ బ్ర్యంట్, డాక్టర్ అలన్ హుగేస్,డేవిడ్ వారెన్, హరీశ్ లోకుమ్ తదితరులున్నారు.

అంబేడ్కర్ వర్సిటీ వీసీకి ఘన సన్మానం



లాలాపేట: ఓయూలోని భూగోళ శాస్త్రం విభాగంలో బుధవారం అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొ సీతారామారావు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ విశ్వవిద్యాలయం జియో ఇన్ఫార్మాటిక్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రొ సీతారామారావును ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రవేశపెట్టిన బీఏ జాగ్రఫీ కోర్సు వలన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పోటీ పరీక్షలకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ కోర్సు మెటీరియల్‌ను ప్రింటెడ్ పుస్తకాలతో పాటు ఆడియో, వీడియో ద్వారా అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఓయూ వీసి రవీందర్, సైన్స్ డీన్ బాలకిషన్, శ్రీనివాస రావు, అశోక్, డా. అనురాధ తదితరులున్నారు.

బ్యాంక్ ఉద్యోగినిపై యువకుడి దాడి

డయల్ 100కు ఫోన్ చేసిన స్థానికులు

గచ్చిబౌలి: బ్యాంక్ ఉద్యోగినిపై ఓ యువకుడు దాడి చేశాడు. గచ్చిబౌలిలోని డీఎల్ఎఫ్ రోడ్డులో ఉన్న ఐసీఐసీఐ బ్యాంకులో ఓ యువతి రిలేషన్స్ మేనేజర్‌గా పనిచేస్తోంది. బుధవారం మధ్యాహ్నం ఓ యువకుడు బ్యాంక్ లోపలికి వచ్చాడు. యువతి వద్దకు వెళ్లి బిగ్గరగా అరవడంతో ఆమె బయటకు వచ్చింది. ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో భార్గవ్ ఆ యువతిపై చేయిచేసుకున్నాడు. దీంతో యువతి ప్రతి దాడి చేసిందని, ఆ తర్వాత మళ్లీ యువకుడు దాడికి పాల్పడ్డారని స్థానికులు చెప్పారు. వారు వెంటనే డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించారు. వెంటనే గచ్చిబౌలి పెట్రోల్ మొబైల్ పోలీసులు బ్యాంక్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే ఆ యువతి బ్యాంక్ లోపలికి వెళ్లింది. ఫిర్యాదు చేసేందుకు నిరాకరించడంతో పోలీసులు వెనుదిరిగారు. తాను పోలీస్ అధికారి కొడుకును అని, ఎవరికి చెప్పినా ఏమీ కాదని యువకుడు కేకలు వేసినట్టు స్థానికులు చెబుతున్నారు. గొడవ జరిగిన కొద్దిసేపటికి ఆ యువకుడి తండ్రి వచ్చి తీసుకెళ్లినట్టు సమాచారం. ఇది ఇలా ఉంటే సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించామని, ఫిర్యాదు చేసేందుకు యువతి సుముఖంగా లేదని పోలీసులు చెబుతున్నారు. గతంలో ఇద్దరు కలిసి ఒకేచోట పని చేసినట్లు తెలిసిందని, గొడవకు గల కారణాలు తెలియవని పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు గచ్చిబౌలి సీఐ జేమ్స్ బాబు తెలిపారు.

పర్యవేక్షణ పైపైకి.. నిర్వహణ గాలికి.!


సర్వేపల్లి రాధాకృష్ణ పార్కులోని ఓపెన్ జిమ్ పరికరాల దుస్థితి

పార్కులపై పర్యావేక్షణ లేదు..? పార్కుల అభివృద్ధిలో చిత్తశుద్ధి ఎక్కడ..? ఓపెన్ జిమ్‌ల మరమ్మతులు మరిచారు. పలుమార్లు ఆయా కాలనీల ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. సేద తీరేందుకు, పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన పార్కుల పట్ల అధికారులకు ఇంత నిర్లక్ష్యం ఏమిటని ఆవేదన చెందుతున్నారు.

నిజాంపేట్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్, బాచుపల్లి, నిజాంపేట్ ప్రాంతాల్లోని 33 వార్డుల్లోని 114 పార్కులకు గాను 90 శాతం పార్కుల్లో అభివృద్ధి పూనులు పూర్తి కాలేదు. కొన్నింటిలో ఇంకా ఎలాంటి పనులు ప్రారంభిక పోవడంతో నిరుపయోగంగా మారాయి. పనులు ప్రారంభించిన పార్కుల్లో లక్షలాది నిధులు వెచ్చించి పనులు ప్రారంభించిన పూర్తి స్థాయిలో పూర్తికాక.. పూర్తియిన పనులు సైతం పాడైపోతున్నాయి. ఈ విషయం ప్రజలు పలుమార్లు అధికారులు, కార్పొరేటర్లకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతుందని స్థానికులు వాపోతున్నారు.

- నిజాంపేట్ మున్సిపల్ పరిధిలోనే ప్రగతినగర్‌లోనే ఏకంగా 52 పార్కులు ఉన్నాయి. అందులో గతంలో గ్రామ పంచాయతీగా పాలనలోనే అభివృద్ధి జరిగిన పార్కులు తప్ప మున్సిపల్‌గా మారిన తరువాత పూర్తి అభివృద్ధి జరిగిన పార్కులు లేవవే ప్రజలు పేర్కొనడం విశేషం. అభివృద్ధి పనులు ప్రారంభించి పనులు పూర్తి కాక అసంపూర్తిగా మిగిలి ఉన్న పార్కులే ఎక్కువగా ఉండటం గమనార్హం.

ఓపెన్ జిమ్‌లను గాలికోదిలేసిన అధికారులు..

పార్కుల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను అధికారులు గాలికోదిలేశారనే విమర్శలు సర్వత్ర వినిపిస్తున్నాయి. ప్రగతినగర్, నిజాంపేట్, బాచుపల్లి ప్రాంతాల్లోని వార్డుల్లో పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ప్రజలు ,పిల్లలు వ్యాయామం చేసే క్రమంలో రిపేర్లు అవసరం అవుతాయనే పరిజ్ఞానం కూడా అధికారులకు లేకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు, పార్కుల పరిస్థితిని సమీక్షించే సమయం అధికారులు, మేయర్, కార్పొరేటర్లకు లేదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- ఉదాహరణకు ప్రగతినగర్‌లోని వాసవీ లేవుట్‌లో ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణ పార్కులో ఏడాది క్రితం ప్రారంభించిన అభివృద్ధి పనులు అసంపూర్తిగానే మిగిలాయి. అరకొర పనులు పూర్తి చేసి చేతులు దులుపుకున్నారు.ఇక ఓపెన్ జిమ్‌లోని అనేక పరికారాలు రిపేర్‌కు వచ్చి సంవత్సర కాలం పూర్తయిన ఇప్పటి వరకు వాటిని రిపేర్ చేసే పరిస్థితి లేదు. ఆ పార్కు బోర్డు సైతం కింద పడిపోయి సంవత్సరం పైగానే అయ్యింది. అయిన కనీసం అటు వైపు తొంగి చూసే పరిస్థితి లేదు.

పార్కులను ప్రకృతి వనాలుగా మర్చడం ఎందుకు ..?

ఉదయం సాయంత్రం వేళల్లో ప్రజలు వాకింగ్ చేసుకోవడానికి, పిల్లలు ఆడుకోవడానికి వృద్ధులు, మహిళలు సేదతీరడానికి పార్కులను అభివృద్ధి చేయాల్సింది పోయి అధికారులు పార్కుల్లో మొత్తం మొక్కలు నాటడం ఏమిటని వివిధ కాలనీల వాసులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలి కదా అని పార్కులను ప్రకృతి వనాలు చేస్తే పార్కుల్లోకి ప్రజలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. మొక్కలు నాటడానికి రోడ్ల పక్కన, పార్కుల్లో అంచులకు, ప్రభుత్వ స్థలాల్లో, ఇలా నాటాల్సింది పోయి పార్కుల్లో నాటుతుండటంతో అధికారుల తీరుపై అనేక విమర్శలు వస్తున్నాయి.



పార్కులను పట్టించుకోవడం లేదు..

పార్కుల అభివృద్ధిని అధికారులు అస్సలు పట్టించుకోవడం లేదు.పార్కుల పరిస్థితిపై కనీసం రివ్యూ చేయలేకపోవడం అధికారుల చిత్తశుద్ధి కనిపిస్తుంది. కార్పొరేషన్ సిబ్బంది, అధికారులు ఏమి చేస్తున్నారు. కాంట్రాక్టలకు పనులు అప్పగించి కూర్చోవడమేనా.. పనులు ఎలా జరుగుతున్నాయి. వాటి పరిస్థితి ఏంటో పట్టించుకోవాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నిస్తున్నారు.

పార్కులను అభివృద్ధి చేయాలి



పార్కులను వేగవంతంగా అభివృద్ధి పరిచి వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉండకూడదు. పిల్లలు ఆడుకునే పరికరాలు సైతం అనేక పార్కుల్లో పాడైపోయి మరమ్మతులు అవసరం ఉన్నాయి. వీటిని గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలి. అదే విధంగా ప్రతి పార్కులో తప్పనిసరిగా మూత్రశాలలు ఏర్పాటు చేయాలి.

– జలగం చంద్రయ్య